క్లుప్తంగా

నేడు రామారావు జయంతి

ఇచ్చోడ: మాజీ మంత్రి గోడం రామారావు జయంతిని మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు సోన్‌కాంబ్లే కృష్ణ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట గోడం రామారావు విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సొనాల నుంచి వజ్జర్‌కు బస్సు నడపాలి

బోథ్: సొనాల గ్రామం నుంచి వజ్జర్ వరకు ఆర్టీసీ బస్సు నడపాలని వజ్జర్‌తో, చింతలబోరితో పాటు పలు గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. సొనాల నుంచి వజ్జర్ వరకు రోడ్డు సౌకర్యం ఉందని, ఈ రూట్‌లో బస్సు నడిపితే దాదాపు 15 గ్రామాల ప్రజలు సౌకర్యంగా ఉంటుందన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ప్రైవేట్ వాహనాల ను ఆశ్రయిస్తున్నారు. తీవ్ర ఇబ్బందులు పడుతూ సొనాలకు చేరుకుంటున్నారు. అధికారులు స్పందించి బస్సు నడపాలని కోరుతున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

బోథ్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో వసతులు, సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా చదవాలన్నారు. చదువుతోనే భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో స్థిరపడతారని అన్నారు. కాగా పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా చూడాలని ప్రిన్సిపాల్ ఉమేష్ ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, నారాయణరెడ్డి, సురేందర్, కట్ట భూమేష్, లింగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

నేరడిగొండ: మండలంలోని కుప్టి గ్రామంలో మున్నూరుకాపు పటేల్స్ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఆకుల ప్రభాకర్ పటేల్, కోశాధికారిగా అంబకంటి రాజేశ్వర్ పటేల్‌లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్నూరుకాపు కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఆకుల లచ్చన్న, కొళ్ళెం భోజన్న, ఆకుల రాజేందర్, అంబకంటి సుదర్శన్ పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు విడుదల చేయడం లేదని డిగ్రీ కళాశాల లెక్చరర్లు తెలిపారు. సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదలయ్యేలా చూడాలని కోరారు. ఇందులో ఉపేందర్ రెడ్డి, వేణు యాదవ్, రాజ్‌కిరణ్ రెడ్డి, లింగన్న, సాయి పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామంలో సోమవారం దేశ వ్యాప్తంగా అమల్లోకి వచ్చిన నూతన చట్టాలపై భీంపూర్ ఎస్సై మొహమ్మద్ కలీం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో సిబ్బందితో కలిసి కిరాణా దుకాణాలు తనిఖీ చేశారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కా అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమంగా దేశీదారు విక్రయించినా.. సరఫరా చేసినా సమాచారం అందించాలన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. సోమవారం మండలంలోని తర్నం (కె) గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ పిల్లలకు పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

రైతుభరోసాపై మహాజన సభ

తాంసి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద సోమవారం రైతుభరోసాపై ప్రత్యేక మహాజన సభ నిర్వహించారు. రైతుభరోసా పథకంపై రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో కేశవ్, ఏడీఏ రవీందర్, వైస్ చైర్మన్ ధనుంజయ్, డైరెక్టర్లు భూమారెడ్డి, అశోక్ రెడ్డి, ఏఈవో సుప్రియ పాల్గొన్నారు.

ఇచ్చోడ సబ్ డివిజన్ పీఆర్ డీఈగా రాజేశుడు

ఇచ్చోడ: సబ్ డివిజన్ ఇచ్చోడ పంచాయతీరాజ్ డీఈగా రాజేశుడు సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఈగా పనిచేసిన శైలేందర్ ఈఈగా పదోన్నతి వెళ్లగా ఏఈ నుంచి పదోన్నతిపై రాజేశుడు డీఈగా బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు వేగవంతం చేయాలన్నారు.

ఇంటర్ చదువుకు దూరం

- భీంపూర్‌లో లేని జూనియర్ కళాశాల
- మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని డిమాండ్
- పట్టించుకోని పాలకులు, అధికారులు



భీంపూర్‌లో కళాశాల కోసం కేటాయించిన స్థలం

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. కళాశాల కోసం మండల విద్యార్థుల ఎదురుచూపులు తప్పడం లేదు. గత కొన్ని ఏళ్లుగా మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతీ ఏటా మండలంలోని వివిధ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ చదువుకు దూరమవుతున్నారు. ఇంటర్ చదువు కోసం జిల్లా కేంద్రానికి లేదా, తాంసి మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలకు వెళ్లాల్సి వస్తోంది. కళాశాలకు వెళ్లడం దూరభారం కావడంతో పాటు సరైన రవాణా సదుపాయం లేక పదో తరగతి చదివి మధ్యలో చదువును ఆపేస్తున్నారు.

మధ్యలోనే మానేస్తున్నారు..

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇంటర్‌లో చేరడం లేదు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ చేయడం లేదు. మండలంలోని భీంపూర్, పిప్పల్‌కోటి, అర్లి(టి), కరంజి(టి), అందర్‌బంద్ గ్రామాల్లోని పాఠశాలలో ప్రతీ ఏటా వందకు పైగా మంది విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణులవుతున్నారు. వీరిలో సగం మంది మాత్రమే ఇంటర్‌లో చేరుతున్నారు. కళాశాలలో చేరిన కొంత మంది విద్యార్థులు కూడా మధ్యలోనే మానేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్తున్నారు.

కళాశాల లేక ఇక్కట్లు..

భీంపూర్ మండలంలో ఎక్కువగా ఆదివాసీలు ఉంటారు. ఎస్టీ, ఎస్సీ వెనుకబడిన విద్యార్థులు అధికంగా ఉంటారు. కాగా.. వీరంతా స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పదో తగరతి చదువుతారు. తరువాత ఇంటర్మీడియట్ విద్య కోసం జిల్లా కేంద్రానికి లేదా తాంసి మండల కేంద్రంలోని కళాశాలకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంతో పాటు తాంసి ప్రభుత్వ కళాశాలకు వెళ్లాలంటే విద్యార్థులకు సరైన రవాణా సదుపాయం లేదు. విద్యార్థులకు దూరభారంతో పాటు అవస్థలు ఉండడంతో చదువుకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే మండలంలోని పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది.

కళాశాల ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువలేక ఇతర పనులకు వెళ్తున్నారు. విద్యార్థులు నష్టపోకుండా వెంటనే కళాశాలను ఏర్పాటు చేయాలి.

– జజ్జరి రాకేశ్‌యాదవ్, బీజేపీ నాయకుడు

స్థలం కేటాయించాం



మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని పలుమార్లు ఇప్పటికే అధికారులకు విన్నవించాం. గత సర్వసభ్య సమావేశంలో అన్ని గ్రామాల సర్పంచ్‌లు, సభ్యులు కళాశాల ఏర్పాటుకు తీర్మానం చేశాం. భీంపూర్ మండల కేంద్రంలో రెండు ఎకరాలు కేటాయించాం.

– లింబాజీ, మాజీసర్పంచ్, భీంపూర్

కథనం కదిలించింది

- బోథ్ నుంచి నిగిని వరకు బస్సు ప్రారంభించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



బస్సు ప్రారంభిస్తున్న మర్లపెల్లి గ్రామస్తులు

బోథ్: సాక్షి దినపత్రికలో వచ్చిన కథనం అధికారులను, ప్రజాప్రతినిధులను కదిలించింది. మండలంలోని మర్లపెల్లి మీదుగా నిగిని గ్రామం వరకు డబుల్ రోడ్డు ఉన్నా.. బస్సు సౌకర్యం లేకపోవడంతో జూన్ 27వ తేదీన ‘గ్రామాలకు చేరని పల్లె వెలుగు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌లు నిర్మల్ డిపో మేనేజర్‌తో మాట్లాడారు. బస్సు ప్రారంభించాలని కోరారు. కొంతమంది యువకులు సైతం బస్సును నడపాలని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈమేరకు సోమవారం బోథ్ నుంచి నిగిని వరకు బస్సును ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. మర్లపెల్లి, బాబెరతండా గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

‘ఎమ్మెల్యేను అవమానిస్తే ఊరుకోం’

నార్నూర్: ఆసిఫాబాద్ నియోజకవర్గంలో అధికారులు కాంగ్రెస్ నాయకులకు తొత్తులుగా మారారని, ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదివాసీ ముద్దుబిడ్డ కోవలక్ష్మిబాయిని ప్రోటోకాల్ పాటించకుండా అవమానిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావులు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి సీతక్క కొంతమంది కాంగ్రెస్ నాయకుల చెప్పుడు మాటలు విని ఎమ్మెల్యే కోవ లక్ష్మిబాయి లేకుండానే ప్రారంభోత్సవాలు చేయడం సరికాదన్నారు. 25 వేల ఓట్ల మెజార్టీతో గెలిచిన మహిళ ఎమ్మెల్యే అనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి సయ్యద్ ఖాసిం, నాయకులు శివాజీ, సుభాష్ రాథోడ్ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బోథ్ ఎమ్మెల్యే

బోథ్: చాకలి ఐలమ్మను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోథ్‌లో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మని గుర్తు చేసుకున్నారు. ఆమె పోరాటం ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

స్ఫూర్తిగా తీసుకోవాలి

చాకలి ఐలమ్మను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజక సంఘం సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.

రుణమాఫీ వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

బోథ్: రుణమాఫీని వెంటనే అమలు చేయాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు భరోసా ద్వారా వెంటనే రైతులకు పెట్టుబడి సాయం అందించాలన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ... రుణమాఫీ, రైతుభరోసా అందకపోవడంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. వెంటనే రుణమాఫీ చేసి, పెట్టుబడి సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మారుతి, అంబాజీ, భూమన్న, సుంగన్న, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోథ్: నేరడిగొండ మండలంలో ఫీడర్ మరమ్మతుల కారణంగా బోథ్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ సోమవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేరడిగొండ: నేరడిగొండ మండలంతో పాటు బోథ్ స్టేషన్ టౌన్ ప్రాంతంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ నాగేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మతుల పనుల కారణంగా అంతరాయం ఏర్పాడుతుందన్నారు.

ఎదులాపురం: మరమ్మతులో భాగంగా బంగారిగూడ 33 కేవీ ఫీడర్ పరిధిలోని బంగారిగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్‌స్టేషన్‌లకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్న 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

బేల వారసంత వేలం

బేల: మండల కేంద్రంలో ప్రతీ బుధవారం నిర్వహించే వారసంత వేలం పాటను సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. వేలంలో 7గురు పాల్గొనగా, గరిష్ఠంగా రూ.6.03లక్షలకు 9నెలల పాటు రేస్‌వార్ మనోజ్‌రెడ్డి దక్కించుకున్నాడు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మహేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సురేశ్, కారోబారి కల్యాణ్‌కార్ గజానన్, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన మునిగెల రమేశ్ తండ్రి ఊషన్న ఇటీవల మృతి చెందడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ బాధిత కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

యువతి అదృశ్యం

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుమారి గ్రామానికి చెందిన యువతి ఆదివారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని బంధువుల ఇంటివద్ద వెతికిన లేకపోవడంతో సోమవారం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గుంతల రోడ్లపై నరక ప్రయాణం



దేవాపటార్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

నార్నూర్: వర్షాకాలం వచ్చిందంటే చాలు మూడు నెలలు గ్రామస్తులు నరకం చూడాల్సిందే. రోడ్డుపై నుంచి ప్రయాణించాలంటేనే వణికిపోతున్నారు. ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన వారి జీవన పరిస్థితులు మాత్రం మారడం లేదు. మండలంలోని దేవాపటారం గ్రామంలో దాదాపు 20 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కాలినడకే దిక్కు. వర్షాకాలం వచ్చిందంటే చాలు మూడు నెలలు రోడ్డుపై భయంతో నడవాల్సిన పరిస్థితి. రోడ్డు రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని గత 15 ఏళ్లుగా పాలకులకు అధికారులకు విన్నవించుకుంటున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులు గెలిచిన తర్వాత గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదు. వర్షాకాలంలో బైక్‌లు కూడా రాలేని పరిస్థితి. అత్యవసర సమయంలో ప్రాణాలను అరచేతిలో పట్టుకొని రోడ్డుపై ప్రయాణం చేయాలి. సంబంధిత శాఖ అధికారులు, ఎమ్మెల్యే చొరవ తీసుకొని గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సభ విజయవంతం చేయండి

ఎదులాపురం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ రజోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 7న రవీంద్ర భారతిలో నిర్వహించే సభకు మాదిగ సోదరులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కదరపు ప్రవీణ్ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1994 జులై 7న ప్రకాశం జిల్లా ఈదుముడు గ్రామంలో 20 మంది యువకులతో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఇప్పుడు లక్షల మంది గుండెల్లో చేరి దేశంలో మారిమోగేలా చరిత్రను సృష్టించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ నాయకులు రమేశ్, పెంటన్న, గంగన్న, శ్రీనివాస్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు నిలిపివేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నార్నూర్: మండల కేంద్రంలోని జీస్‌గూడ శివారులోని గుట్ట ప్రాంతంలో అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తుడుం దెబ్బ ఆధ్వరంలో తహసీల్దార్ జాడి రాజలింగుకు వినతిపత్రం అందజేశారు. తుడుందెబ్బ గౌరవ అధ్యక్షుడు ఆత్రం పరమేశ్వర్, ఆర్కా గోవింద్‌లు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో 1/70, పెసా చట్టాలకు విరుద్ధంగా ఐదో షెడ్యూల్లో ఎవరికీ తెలియకుండా గట్టుచప్పుడుగా అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు చేస్తున్నారని ఆరోపించారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఈస్రు, మెస్రం హీరాలాల్, పూసం భావురావ్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు తాడిపత్రిలు అందజేత



పంపిణీ చేస్తున్న హైకోర్టు న్యాయవాది కృష్ణప్రసాద్

తలమడుగు: మండలంలోని మందగూడ గ్రామంలో అకాల వర్షానికి ఈదురు గాలులకు ఇళ్లపై రేకుల కొట్టుకపోయిన బాధితులకు సోమవారం హైకోర్టు న్యాయవాది కృష్ణప్రసాద్ తాడిపత్రిలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు గత మే నెలలో ఈదురుగాలకు నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని ఉద్దేశంతో తాడిపత్రిలు అందజేయడం జరిగిందన్నారు. అలాగే గ్రామంలోని చదువుకునే పిల్లలకు నోటుబుక్‌లరు కూడా అందజేశామన్నారు. ఆదివాసీ గిరిజనులకు సహాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నితీష్, కిరణ్, దినేష్, సాయిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పశువులను కట్టడి చేయాలని వినతి

బోథ్: బోథ్ పట్టణంలో తిరుగుతున్న పశువులను కట్టడి చేయాలని గ్రామస్తులు సోమవారం ఎంపీడీవో రమేశ్, గ్రామపంచాయతీ ఈవో అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. పశువులు పంట చేలల్లో గేదెలు, మేకలు, ఆవులు, ఎద్దులు తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పూండ్రు కిశోర్, మెరుగు లింగారెడ్డి, వెంకటేశ్, సూర్య ప్రకాష్‌రెడ్డి, వాసురెడ్డి, పూండ్రు సుభాష్, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

స్తంభాలు వేశారు.. తీగలు మరిచారు



నేరడిగొండ మండలంలోని వడూర్‌లో రైతుల వ్యవసాయ పంపు సెట్ల కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. నెలరోజులు గడుస్తున్నా.. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభాలకు విద్యుత్ తీగలు అమర్చడం మరిచారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాలకు విద్యుత్ తీగలకు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

– నేరడిగొండ

వైద్యాధికారులకు సన్మానం



ఇచ్చోడ: వైద్యాధికారులను సన్మానిస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా వైద్యాధికారులు సాగర్, అలైఖ్యలను పీహెచ్‌సీ సిబ్బంది శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ సాగర్ మాట్లాడుతూ.. వైద్యవృత్తిలో ఎంతో మంది రోగులకు సేవలు అందించి ప్రాణాలు కాపాడిన ఘటనలు జీవితంలో మరిచిపోలేనివన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసిన వైద్యులకు గుర్తిండిపోయే ఘటనలు చాలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యులను ఘనంగా సన్మానించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న వైద్యాధికారి శ్రావ్య వాణి, ఆయుష్ వైద్యాధికారి నర్మదను వైద్యసిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తులసీరాం, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీలత, సిబ్బంది ఉన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని నాగబూషణం పాఠశాలకు చెందిన విద్యార్థులు సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను శాలువాతో సత్కరించారు. స్థానిక వైద్యురాలు శైలజ, విశ్వనాథ్‌లను సత్కరించారు. ప్రజలకు వైద్యులే దేవుళ్లని పేర్కొన్నారు. వైద్యులను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు.

డీఐవోకు..

ఆదిలాబాద్‌టౌన్: అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్‌ను ప్రజాఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ రావు, డి.సంతోష్, నల్ల రవీందర్, సురేశ్, సుభాష్, సచిన్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న లెక్చరర్లు, సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వీరస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన భరద్వాజ ఉద్యోగ విరమణ పొందడంతో ఈయనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ హెచ్‌వోడీగా విధులు నిర్వర్తిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను కళాశాల లెక్చరర్లు రాజ్‌కుమార్, మాశయ్య, రాజన్న, సుజయ్, క్రాంతికుమార్, ఏవో రాజేశ్ శుభాకాంక్షలు తెలిపారు.